క్లుప్తంగా

కండ్లకలక మాత్రల పంపిణీ



తుని మార్కెట్‌లో హోమియో మాత్రలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

తుని: స్థానిక మార్కెట్‌లో తుని వాకర్స్ హెల్త్ క్లబ్ ఏర్పాటు చేసిన కండ్ల కలక హోమియో మాత్రలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం కండ్ల కలక వ్యాధితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, హోమియో మాత్రలను అందరూ వేసుకోవాలన్నారు. 500 మందికి ఉచితంగా మాత్రలను పంపిణీ చేశామని వాకర్స్ హెల్త్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు కుందెం సత్యనారాయణ తెలిపారు. ఎలక్ట్ గవర్నర్ చదరం శివాజీ, కోశాధికారి జూరెడ్డి చిరంజీవి, పర్వత బాబూరావు, నెల్లిపూడి రాజబాబు, కె.గౌరీ శంకర్ పాల్గొన్నారు.

కండ్లకలకతో జాగ్రత్త



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డాక్టర్, ఆదిత్య సిబ్బంది

గండేపల్లి: కండ్లకలకల వ్యాప్తిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ అపోలో హాస్పిటల్ సీనియర్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ అనూష చౌదరి తెలియజేశారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కాలేజీలో స్టూడెంట్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కండ్ల కలకపై అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కండ్ల కలకల వ్యాప్తి తీవ్రంగా ఉందని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యాధి సోకినవారు డాక్టర్‌ను సంప్రదించకుండా ఎటువంటి యాంటీ బయోటిక్స్ మందులను ఉపయోగించరాదన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, ఈ పోస్టర్ ప్రజెంటేషన్ కాంపిటీషన్‌లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కళాశాల ప్రిన్సిపాల్ సతీష్ కుమార్ అందజేశారు. స్టూడెంట్ క్లబ్ కో ఆర్డినేటర్ శ్రీ సౌఖ్య, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎంఈఓ

గండేపల్లి: మండలంలోని కె.గోపాలపురంలో ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ కేహెచ్ నాయక్, కె.వెంకటరెడ్డి మంగళవారం పరిశీలించారు. భోజనం రుచి గురించి విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. అనంతరం వర్క్‌బుక్స్, ఉపాధ్యాయుల డైరీలను పరిశీలించి మెనూ ఏవిధంగా అమలు జరుగుతోందని ఉపాధ్యాయులను ఆరా తీశారు.

నేటి నుంచి నా భూమి-నా దేశం

ప్రత్తిపాడు: మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు నా భూమి-నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం, 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ వేడుకలు' నిర్వహించనున్నట్టు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ ఏవీబీ నాయుడు తెలిపారు. తొలిరోజు 9న ప్రత్తిపాడు, ఒమ్మంగి, 10న ఉద్దండ జగన్నాథపురం, వెంకటనగరం, చింతలూరు, రాచపల్లి, గజ్జనపూడి గ్రామాల్లోనూ, 11న ఉత్తరకంచి, లంపకలోవ, పెదశంకర్లపూడి, ఏలూరు, ధర్మవరం గ్రామాల్లోనూ, 12న పెద్దిపాలెం, గోకవరం, పాండవులపాలెం, బవురువాక, శరభవరం గ్రామాల్లోనూ, 13న పోతులూరు, వాకపల్లి, బురదకోట, టి రాయవరం, చినశంకర్లపూడి గ్రామాల్లో ఈ వేడుకలు జరుగుతాయన్నారు. అధికారులు, కార్యదర్శులు, గృహ సారథులు, సచివాలయ కార్యదర్శులు, ఆయా గ్రామాల ప్రజలు, యువత పాల్గొని విజయవంతం చేయాలని ఏపీఓ ఏబీవీ నాయుడు కోరారు.

సామూహికంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



ప్రత్తిపాడులో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ కాంతి

ప్రత్తిపాడు: నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల పదో తేదీన సామూహికంగా చేపట్టాలని ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ కోరారు. ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నులిపురుగుల నివారణపై జరిగిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యార్థులతో మింగించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను మండలంలోని 48 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంపీపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, రాచపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఆర్‌ఆర్ పవన్‌కుమార్, మండల విద్యాశాఖాధికారులు వి.రాజబాబు, వై.అచ్చిరాజు పాల్గొన్నారు.

పల్లెవిస్తున్న పారిశుధ్యం

- 'స్వచ్ఛ సంకల్పం'తో గ్రామాలు పరిశుభ్రం
- చెత్త, చెదారం శివార్లకు తరలింపు
- అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు



ఉప్పంపాలెంలో చెత్తను తొలగిస్తున్న కార్మికులు



బలరామపురంలో డ్రైన్లలో పేరుకుపోయిన చెత్తను బండిలో వేస్తున్న పారిశుధ్య కార్మికులు



ఎ.మల్లవరంలోని వీధిలో క్రిమిసంహారక మందును పిచికారీ చేయిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రౌతులపూడి: గ్రామాల్లోని వీధులన్నింటిని పరిశుభ్రంగా ఉంచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన 'స్వచ్ఛ సంకల్పం' పథకంతో గ్రామాలన్నీ పరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. పంచాయతీ నిర్వాహకులు పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసి చెత్తాచెదారం లేకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. డ్రైన్లలోనూ, ప్రధాన వీధుల్లోను పేరుకుపోయిన చెత్తను, మురికినీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి అనారోగ్య ఇబ్బందులు లేకుండా చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలను గ్రామశివారులో సుదూర ప్రాంతాలకు తరలించేలా పంచాయతీలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ, వైద్యారోగ్యశాఖ అధికారులంతా అప్రమత్తమయ్యారు. దీంతో గ్రామాల్లోని వీధుల్లో చెత్త పడవేయకుండా, ఈగలు, దోమలు వ్యాపించకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధుల ప్రోద్బలంతో గ్రామాలను స్వచ్ఛంగా ఉంచుతున్నారు.

పారిశుధ్య నిర్వహణ ఇలా..

ఏటా లక్షలాది రూపాయల ఆర్థిక సంఘం నిధులతోబాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేస్తోంది. పదిహేనవ ఆర్థిక సంఘం నిధులు మండలంలోని 26 పంచాయతీలకు సుమారు రూ.1.5 కోట్ల వరకు విడుదల చేసినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. నిధులను గ్రామ పంచాయతీలు 60శాతానికి పైగా ఖర్చు చేశాయి. కొద్దిపాటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు స్వచ్ఛ సంకల్పంపై దృష్టి సారిస్తున్నామని పలువురు సర్పంచ్‌లు పేర్కొంటున్నారు.

స్వచ్ఛ సంకల్పంపై అవగాహన కార్యక్రమాలు

స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సంకల్పం వంటి ర్యాలీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చిదిద్దటానికి అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. జన సంచారం ఉన్న చోటనే బహిరంగ మరుగుదొడ్లు, ఆపై చెత్తకుప్పలు పేరుకుపోవటం వలన ఎలాంటి దుర్వాసన రాకుండా అవసరమైన మేరకు పంచాయతీలు చర్యలు చేపట్టాయి. ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను ఎప్పటికప్పుడు సక్రమంగా ఖర్చు చేసి గ్రామాలను నిర్మలంగా పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

వీధులను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యం



గ్రామంలో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వీధులన్నింటిని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాం. స్వచ్ఛ సంకల్పం పథకంలో భాగంగా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మురికినీరు, చెత్త పేరుకుపోకుండా తొలగించే చర్యలు చేపట్టాం. ఆరోగ్య సిబ్బంది సహకారంతో డ్రైన్లలో స్ప్రేయింగ్ చేయించి దోమలు, ఈగల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

– యెనుముల కోటేశ్వరదొర, సర్పంచ్ ఉప్పంపాలెం

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక డ్రైవ్



గ్రామాల్లో పేరుకుపోయిన మురికినీటి నిల్వలతోబాటు, చెత్త, చెదారం తొలగించేందుకు ఎప్పటికప్పుడు డ్రైవ్ చేపడుతున్నాం. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ఎలాంటి ఫిర్యాదులు లేవు. మరో వారం రోజుల్లో పారిశుధ్య నిర్వహణకు సంబంధించిన వివరాలను పంచాయతీ కార్యదర్శుల ద్వారా సేకరించి అవసరమైన చర్యలు చేపడతాం.

– వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ, రౌతులపూడి

తల్లిపాల వారోత్సవాలు



పోతులూరులో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేసిన నాయకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పోతులూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ నాగులాపల్లి బాబ్జి, ఏఎన్ఎంలు, హెచ్‌పీఎల్‌హెచ్, ఆశా వర్కర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ 13వ వార్షికోత్సవం



కాకరాపల్లిలో పూజలందుకున్న కనకదుర్గమ్మ

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లి కనకదుర్గమ్మ ఆలయ 13వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి చండీసప్తసతి హోమం, పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి దుర్గమ్మవారిని దర్శించారు. అనంతరం ఆలయం ముందుభాగంలో నవదుర్గలను ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ కామేశ్వరి

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి వైద్య పరీక్షలకు విచ్చేసిన గర్భిణులకు లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. లంపకలోవ సొసైటీ మాజీ అధ్యక్షుడు గంటా సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పౌష్టికాహార కిట్లను సమకూర్చారు. వీటిని లంపకలోవ మాజీ సర్పంచ్ గంటా కామేశ్వరి చేతుల మీదుగా 66 మంది గర్భిణులకు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంజినీర్ బి. మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ ఇన్‌చార్జి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్‌ఎంఓ) ఎం.కన్యాకుమారి, సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఏడిద రెడ్డినాయుడు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఇందన ఏసుబాబు, గుడాల వెంకటరత్నం, గొంప రామకృష్ణ, తాతా సాంబు పాల్గొన్నారు.

పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ

జగ్గంపేట: పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తు చూపించాలన్నదే గ్రామ పునర్నిర్మాణ సంస్థ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగానే పలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జగ్గంపేట మండలంలోని మర్రిపాక, సగరపేట, ఇర్రిపాక, తదితర గ్రామాలలో 774 మంది పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రాజెక్టు మేనేజర్ పాల్ రాజ్‌కుమార్, సంస్థ ప్రతినిధి సైదులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళులు



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలేశ్వరం: ప్రజా యుద్ధనౌక, విప్లవ గాయకుడు గద్దర్‌కు పట్టణంలో మంగళవారం ఘనంగా నివాళులు అర్పించారు. కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక క్వారీ ప్రాంతంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంఘం ప్రధాన కార్యదర్శి కుప్పల నాగభూషణం మాట్లాడుతూ ప్రజా గాయకుడు గద్దర్ అణగారిన వర్గాల కోసం ఎంతో శ్రమించారన్నారు. సీపీఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొసిరెడ్డి గణేష్, నాయకులు పలప సుందరి, గండేటి నాగమణి పాల్గొన్నారు.

21,22 తేదీల్లో ఏపీఎన్‌జీఓ మహాసభలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

ప్రత్తిపాడు: విజయవాడలో ఈ నెల 21, 22వ తేదీలలో జరుగనున్న ఏపీఎన్‌జీఓ 21వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ప్రత్తిపాడు యూనిట్ ఏపీఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు రామిశెట్టి రాంబాబు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రత్తిపాడు యూనిట్ ఏపీఎన్‌జీఓ సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన రామిశెట్టి రాంబాబు మాట్లాడుతూ ఎన్‌జీఓ కౌన్సిల్ సమావేశానికి ప్రత్తిపాడు యూనిట్ నుంచి అధిక శాతం ఉద్యోగులు హాజరుకావల్సిందిగా కోరారు. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, సబ్ రిజిస్ట్రార్ టి. సుబ్బారెడ్డి, మండల వైద్యాధికారి ఆర్‌ఆర్ పవన్‌కుమార్, మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు, సబ్ ట్రెజరీ ఆఫీసర్ సలీమ్‌ఖాన్, ఏపీఎన్‌జీఓ ప్రతినిధులు ఎంఎస్ సత్యనారాయణ, పీఎస్ఎస్ మూర్తి, జువ్వల రాజా, చంద్రరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రగతికి ప్రణాళిక అవసరం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



సమావేశంలో నులిపురుగుల వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట: మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలంటే ప్రణాళిక అవసరమని, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు.

మంగళవారం జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన జరిగిన మండల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై సమీక్ష నిర్వహించారు. మండల సమావేశాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని అన్నారు. కొంతమంది మండల సమావేశాలకు రాకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాలలో సమస్యలు ప్రజా ప్రతినిధులు ద్వారా తెలిసినపుడే వాటి పరిష్కారానికి అధికారులకు తగిన సూచనలు చేయగలమని అన్నారు. వర్షాకాలం కారణంగా ఎన్ఆర్‌జీఎస్ ద్వారా గ్రామాలలో మొక్కలు పెంచే కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఆర్‌జీఎస్, వెలుగు, విద్య, పంచాయతీరాజ్ తదితర శాఖల పనితీరుపై సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమంలో రామవరం గ్రామంలో అంగన్‌వాడి వర్కర్‌గా కొత్తగా ఎంపికైన దొండపాటి అనూషరాణి అనే మహిళకు నియామక పత్రాలు అందజేశారు. నులిపురుగుల వారోత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బింధుమాధవి, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఉభయగోదావరి జిల్లాల కన్వీనర్ జాన్ వెస్లీ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాని, ఎంపీడీవో వసంతకుమార్, తహసీల్దార్ శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుని ఉపఎన్నికకు నామినేషన్

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరంలో ఖాళీ అయిన 5వ వార్డు సభ్యుని ఉప ఎన్నికకు రొంగలి రాజేశ్వరి నామినేషన్ దాఖలు చేశారని ఎంపీడీవో ఎం.గోవింద్ తెలిపారు. ఈ నెల 19న జరిగే సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికల నేపథ్యంలో నోటిఫికేషన్ వెలువడిన సంగతి తెలిసిందే. మండలంలో ఎ.మల్లవరం-5, ఎం.కొత్తూరు-4, జల్దాం-7 వార్డు సభ్యుల ఉపఎన్నికకు మంగళవారం తొలి నామినేషన్ దాఖలయిందని వివరించారు. ఈ నెల 10 వరకు అభ్యర్థుల నామినేషన్ దాఖలు చేసుకునే అవకాశం ఉందన్నారు.

రోటరాక్ట్ నూతన కార్యవర్గ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న రోటరీ నూతన అధ్యక్షులు

తుని: స్థానిక శ్రీప్రకాష్ అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ యంగ్ లీడర్స్, సబల నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి రోటరాక్ట్ డిస్ట్రిక్ట్ కమిటీ చైర్మన్ రొటేరియన్ రవి, తుని రోటరీ క్లబ్ అధ్యక్షుడు రొటేరియన్ కేఎస్ఎస్ఎల్ వర్మ, కార్యదర్శి కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి క్లబ్ ఆఫ్ యంగ్‌లీడర్స్ అధ్యక్షుడిగా రోటరాక్టర్ షణ్ముఖ్, సబల అధ్యక్షురాలిగా రోటరాక్టర్ రీనా ఎన్నికయ్యారు. వీరితో డిస్ట్రిక్ట్ గవర్నర్ ప్రమాణం చేయించారు. గత ఏడాది అధ్యక్షులు పార్థసారథి, లహరి నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేసి పదవీ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ గత ఏడాది తమ రోటరాక్ట్ క్లబ్ ద్వారా బ్లడ్‌బ్యాంకులకు 150 యూనిట్ల రక్తం దానం చేశామన్నారు. ఈ ఏడాది మరిన్ని కార్యక్రమాలతో క్లబ్‌ను ముందుకు నడిపిస్తామని తెలిపారు. తమ విద్యార్థులు చేసే ప్రతీ కార్యక్రమానికి విద్యాసంస్థల తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు. రోటరీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా

- ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం చేయకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టినట్లు ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, పోలీస్, లీగల్, స్త్రీ శిశు సంక్షేమ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడ శిశువుల పట్ల వివక్షతో జరిగే భ్రూణహత్యలను నివారించడంతో పాటు గర్భస్థ పిండ లింగనిర్ధారణ చట్టం అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని, చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్లు మొత్తం 104 ఉన్నాయని, దీనిలో 10 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నాయన్నారు. గత ఏప్రిల్ నుంచి జులై వరకు 24 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 79 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేసినట్టు తెలిపారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలోనూ పీసీ, పీఎన్‌డీటీ చట్టానికి సంబంధించి బోర్డులను, వాల్ పోస్టర్లను ప్రదర్శించాలని ఆయన కోరారు. డాక్టర్ ఐ.ప్రభాకర్, జి.రాము, ఎం.కీర్తిప్రియ, ఎన్‌జీవో ప్రతినిధులు కె.సింహాద్రి, పి.సత్యవతి, ఎస్.కృష్ణారావు, ఎల్.శృతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జాన్‌వెస్లీ



జాన్‌వెస్లీని సత్కరించిన ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట: జగ్గంపేట మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ జోనల్ ఇన్‌చార్జి జాన్‌వెస్లీని రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జగ్గంపేట ఎంపీడీవో కార్యాలయంలో జాన్‌వెస్లీని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అభినందించి, శాలువాతోను, పూలమాలలతోను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కృషి చేసిన వారికి ఎప్పుడు సముచిత స్థానం లభిస్తుందని అన్నారు. జాన్ వెస్లీని ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి



జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఎంపీ గీత

కాకినాడ రూరల్: ఢిల్లీలో జాతీయ స్థాయిలో జరిగే క్రీడలకు ఎంపికైన కాకినాడ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులను ఎంపీ వంగా గీత అభినందించారు. జాతీయ స్థాయి పోటీలలో సత్తా చాటాలన్నారు. వలసపాకల పాఠశాలలో చదువుతున్న వారు హైదరాబాద్‌లో జరిగిన హాకీ, బ్యాడ్మింటన్, చెస్, బాక్సింగ్, స్కేటింగ్ పోటీలలో ప్రతిభ చూపి ఢిల్లీలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ బి.శేఖర్, పీఈటీ టి.అశోక్‌కుమార్ ఎంపీ గీతకు పరిచయం చేశారు. కాకినాడకు పేరొచ్చేలా ఆటలు ఆడాలని ఆమె విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో వంగా విశ్వనాథ్, రావుల మాధవరావు పాల్గొన్నారు.

సత్తాచాటిన క్రీడాకారుడికి సత్కారం



వీరబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట: దుబాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో గోల్డు మెడల్ సాధించి అంతర్జాతీయ స్థాయిలో జగ్గంపేట పేరు మారుమోగేలా చేసిన వీరబాబు మరిన్ని విజయాలు సాధించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. దుబాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో జగ్గంపేటకు చెందిన బుర్ర శివసాయి వీరబాబు 74 కేజీల విభాగంలో గోల్డు మెడల్ సాధించాడు. మంగళవారం జగ్గంపేట వచ్చిన వీరబాబుకు క్రీడాకారులు, యువకులు ఘనంగా స్వాగతం పలికారు. భారీ ఊరేగింపు, త్రీన్‌మార్ డ్యాన్సుల మధ్య జగ్గంపేట ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్న వీరబాబును జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా,ప లువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు. ఎమ్మెల్యే శాలువాతోను,పూలమాలలతోను వీరబాబును సత్కరించారు. బండారురాజా మాట్లాడుతూ వీరబాబు జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీలలో విజయం సాధించి, దుబాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు అతనికి రూ.లక్ష సహాయాన్ని అందజేశారని తెలిపారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, క్రిస్టియన్ మైనారిటీ సెల్ కన్వీనర్ జాన్ వెస్లీ, సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు కాపు, జిమ్ కోచ్ కన్నారావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తుని రూరల్: తుని మండలం తేటగుంట జంక్షన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు రూరల్ ఎస్సై విజయకుమార్ తెలిపారు. మంగళవారం స్థానికులు అందించిన సమాచారంతో ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మాసిన దుస్తులతో ఉన్న మృతుడి వద్ద నిరుపయోగమైన సెల్‌ఫోన్ బ్యాటరీలు, వాడేసిన పేపర్ టీ కప్పులు ఉన్నాయన్నారు. మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందినట్టుగా భావిస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై విజయకుమార్ వివరించారు.

11న ఉచిత కంటి వైద్య శిబిరం

తుని: స్థానిక పార్కు వీధిలోని పుష్ప ప్రాథమిక కంటి ఆసుపత్రిలో వాసవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తుని శాఖ అధ్యక్షుడు కుసుమంచి సత్యనారాయణ మంగళవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి కంటి పరీక్షలు చేస్తారని, కంటిలో శుక్లాలు ఉన్న వారిని బస్సులో విజయనగరం తీసుకువెళ్లి పుష్పగిరి కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేస్తారన్నారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ

గండేపల్లి: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు మంగళవారం వైద్య సిబ్బంది నివారణ కిట్లు పంపిణీ చేశారు. ఈ వ్యాధి సోకినవారికి కాళ్లు, చేతులు, శరీర భాగాలు శాశ్వతంగా వాపు వస్తాయని, సరైన జాగ్రత్తలు పాటించకపోతే పుండ్లు ఏర్పడతాయని వివరించారు. నివారణకు అవసరమైన మందులు, ప్లాస్టిక్ టబ్స్, జగ్గులు, సబ్బులు, ఆయింట్‌మెంట్ అందజేశారు.

ప్రణాళికతో సివిల్స్‌లో రాణింపు

కాకినాడ: కృషి, పట్టుదల, సరైన ప్రణాళిక ఉంటే సివిల్స్‌లో రాణించడం కష్టం కాదని రాష్ట్ర కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. పేదరికం నుంచి ఎంతో మంది సివిల్స్‌లో రాణించడమే ఇందుకు నిదర్శనమన్నారు. స్థానిక అన్నవరం సత్యదేవి మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన అవేర్‌నెస్ ఆన్ సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్‌లో ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సానుకూల దృక్పథంతో పాటు పుస్తకాలను చదవడం, సీనియర్లతో అభిప్రాయాలను పంచుకోవడం ముఖ్యమన్నారు.